బ్రిడ్జి కోర్సు కోసం దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉపాధి కల్పన, శిక్షణ శాఖ నిర్వహిస్తున్న పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో (ఐటీఐ) రెండేళ్ల ట్రైనింగ్ కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో అడ్మిషన్లు పొందేందుకు నిర్వహించే బ్రిడ్జి కోర్సు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ బాలుర ఐటీఐ నిజామాబాద్ ప్రిన్సిపాల్ యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు రెండేళ్ల ఐటీఐ ట్రైనింగ్‌కోర్సు పూర్తిచేసి 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులు చదువుకోవాలని తెలిపారు.



లేఆఫ్‌కు తొమ్మిదేళ్లు!

- నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ మూతతో రోడ్డున పడ్డ కార్మికులు
- రాజకీయ పార్టీలకు ఎన్నికల ప్రచార అస్త్రంగా లేఆఫ్ వ్యవహారం

7

గ్రామాల్లో జోరుగా పేకాట

- గ్రామ శివారు ప్రాంతాలే పేకాట స్థావరాలు
- పట్టించుకోని పోలీసులు
- గ్రామాల్లో అవగాహన కరువు
- స్టేషన్‌కే పరిమితం అవుతున్న పోలీసులు



7



ముగిసిన సీఎంకప్ క్రీడా పోటీలు

- చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలి
- అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్

7



- కొత్త భూభారతి చట్టం కోసం జిల్లా రైతుల ఎదురుచూపు
- ఈ చట్టం అమలుతో సాదాబైనామాల క్రమబద్ధీకరణకు అవకాశం వస్తుందని ఆశ
- జిల్లాస్థాయిలో నాలుగంచెల వ్యవస్థ ఏర్పాటు కానుండటంతో పరిష్కారం కానున్న సమస్యలు



భూభారతిపై ఆశలు!

నిజామాబాద్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలోని రైతులు కొత్త భూభారతి చట్టం అమలు కోసం ఎదురుచూస్తున్నారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న తమ భూసమస్యలు ఈచట్టం ద్వారా పరిష్కారం అవుతాయని భావిస్తున్నారు. ధరణితో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సాదాబైనామాలు క్రమబదీకరిస్తారని ఎదురు చూస్తున్నారు. ధరణిని రద్దు చేయడంతోపాటు భూభారతిని తీసుకురావడంతో మండల, ఆర్‌డీవో స్థాయిలోనే ఎక్కువ సమస్యలు పరిష్కారం అవుతాయని అంచనాకు వస్తున్నారు. ఏళ్ల తరబడి ఎదురు చూసిన భూసమస్యలు పరిష్కారం కావడంతోపాటు భూములకు సంబంధించిన వివాదాలన్నీ తొలగుతాయని ఎదురు చూస్తున్నారు. ధరణితో కలెక్టర్ నుంచి సీసీఎల్‌ఏ వరకు తిరిగి సమస్యలు ఎదుర్కొన్న వారందరూ ఈచట్టంపై తమకు కలిసివస్తుందని భావిస్తున్నారు. జిల్లాలోని నాల్గంచెల వ్యవస్థతో సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉండటంతో కొత్త చట్టం కోసం అధికారులు ఎదురు చూస్తున్నారు.

ధరణితో ఇబ్బందుల పాలైన రైతులు

గత బీఆర్ఎస్ హయాంలో భూముల సమస్యలు పరిష్కరించేందుకు ధరణిని తీసుకొచ్చి గత కొన్నేళ్లు భూమికి సంబంధించిన క్రయవిక్రయాలన్నీ తహశీల్దార్ స్థాయిలోనే రిజిస్ట్రేషన్‌లు చేయించింది. వ్యవసాయ భూములన్నీ తహశీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కొనసాగిస్తుండగా ఆస్తులకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కొనసాగిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత పలు రకాల సమస్యలు ఉత్పన్నమయ్యాయి. జిల్లాలో ధరణి తీసుకువచ్చిన సమయంలో భూముల వివరాలను సక్రమంగా నమోదు చేయకపోవడంతో చాలామంది రైతులు ఇబ్బందులు పడ్డారు. వాటిని సరిచేసుకునేందుకు ఏళ్ల తరబడి తిప్పలు పడుతున్నారు. ధరణిలో భూసంబంధించిన వివరాలు నమోదు సమయంలో తప్పులు దొర్లడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ధరణిలో సక్రమంగా సరిచేసేందుకు ఆప్షన్లు లేక దరఖాస్తు చేసుకున్న కలెక్టర్ స్థాయిలోనే చేయాల్సి రావడంతో ఎక్కువ మంది ఏళ్ల తరబడి తిరుగుతూనే ఉన్నారు. ధరణిలో నమోదు చేసే సమయంలో సర్వే నెంబరు, పట్టా భూమిలో పేర్ల నమోదు తప్పుదొర్లడం, ఆధార్ నెంబర్ వేయకపోవడంతో సమస్యలు వచ్చాయి. ఇవేకాకుండా వ్యవసాయేతర భూములుగా చూపెట్టడం కొన్ని భూములను నిషేధిత జాబితాలో పొందుపర్చడంతో సరిచేయడానికి ఆప్షన్ లేకపోవడంతో జిల్లా కలెక్టరేట్‌తోపాటు హైదరాబాద్‌లోని సీసీఎల్ కార్యాలయాల వరకు తిరిగారు. కొంతమంది పనులు పూర్తిచేసుకోగా మరికొన్ని పనులు అలాగే ఉండిపోయాయి. చాలా మందివి పనులు పూర్తి కాలేదు. ఇప్పటికీ వేలాది దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయి.

పెండింగ్‌లోనే వేలాది సమస్యలు

ధరణిలో సాదాబైనామాలకు సంబంధించిన ఆప్షన్ లేక వేలాది మంది రైతులు ఇప్పటికీ ఆ భూములకు రిజిస్ట్రేషన్ చేసుకోలేకపోతున్నారు. జిల్లాలో సాదాబైనామాల కింద 2017లో సుమారు 63వేల మందికి పైగా రైతులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అప్పుడు రైతులు తమను క్రమబద్ధీకరించాలని తమ భూములకు పట్టాలు జారీచేయాలని దరఖాస్తులు చేసుకున్నారు. ధరణి వచ్చిన తర్వాత కూడా 2020లో దరఖాస్తులను చేశారు. వీటిలో సుమారు 20వేల వరకు సమస్యలను పరిష్కరించిన నేటికీ పరిష్కారం కాకుండా 40వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా స్థాయిలో దరఖాస్తు చేసినవి 25వేల 632 వరకు పెండింగ్‌లో ఉన్నాయి. ఇంకా కొంతమంది దరఖాస్తు చేసుకోలేదు. ఈ సాదాబైనామాలకు సంబంధించిన భూముల రైతులు 20-30 ఏళ్ల క్రితమే ఈ భూములను కొనుగోలుచేశారు. అప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకోకపోవడం, పట్టాదారు పాసుపుస్తకాలు తీసుకోకపోవడం వల్ల సమస్యలు ఎదుర్కొంటున్నారు. గత 30 ఏళ్లుగా వారే ఈ భూములను సాగు చేస్తున్నా గతంలో అమ్మిన వారు కొన్నిచోట్ల ఫిర్యాదులు చేయడం వల్ల ఇంకా సమస్యలు పెరిగాయి. తాము సాగులో ఉన్నామని అధికారుల చుట్టూ తిరిగినా ఈ భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కారం కాలేదు. వీటితో పాటు చిన్న సాంకేతిక సమస్యలతో కలెక్టర్, కిందిస్థాయి కార్యాలయాల్లో సుమారు 4వేల వరకు దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో కొన్నింటిని ప్రతిరోజు పరిష్కరిస్తున్నా ఇంకా కొత్త దరఖాస్తులు వస్తూనే ఉన్నాయి. ధరణిలో ఆప్షన్ లేక మండల, ఆర్‌డీవో స్థాయిలో పరిష్కరించే అవకాశం లేకపోవడం వల్ల రైతులకు ఇబ్బందులు ఎదురయ్యాయి.

భూభారతిపైనే రైతుల ఆశలు

రాష్ట్ర ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతిని తీసుకురావడంతో తమ సమస్యలకు పరిష్కారం దొరుగుతుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. సాదాబైనామాలతోపాటు ఇతర సమస్యలు కూడా ఈ చట్టంతో పరిష్కారం అవుతుందని ఎదురుచూస్తున్నారు. భూభారతి చట్టం ప్రకారం భూములకు సంబంధించి చట్టబద్ధమైన హక్కులు కల్పించడంతో పాటు శాశ్వత రికార్డులను కూడా తయారు చేసేందుకు చట్టంలో పొందుపర్చారు. సాదాబైనామాల క్రమబద్ధీకరణ పకడ్బందీగా మ్యుటేషన్ భూమి హక్కుల కల్పన, భూ రికార్డుల సవరణ, డిజిటల్ ల్యాండ్ రికార్డుల సవరణ చేయడంతో పాటు కొత్త చట్టం ద్వారా పార్ట్-బీలోని భూముల కేసులపై సత్వర నిర్ణయం (తరువాయి 8వ పేజీలో...)

వైద్యాధికారులతో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమీక్ష

- రోగులకు అందిస్తున్న సేవలు, ఖాళీల వివరాల సేకరణ
- ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన

సుభాష్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతుతో కలిసి పరిశీలించి వైద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. శనివారం నగరంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న నూతనంగా నిర్మించి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మాతా శిశు ఆరోగ్య కేంద్రం క్రిటికల్ కేర్ యూనిట్లతో కూడిన భవన సముదాయాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అనంతరం జిల్లా ఆసుపత్రిలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆసుపత్రిలోని వివిధ విభాగాల వైద్య అధికారులతో సమీక్ష నిర్వహించారు. నూతన ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా రానున్నడంతో ఆయా విభాగాల అధిపతులతో సమావేశమై కూలంకషంగా చర్చించారు. ఒక్కో విభాగం వారిగా రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, డాక్టర్లు, సిబ్బంది, ఖాళీలు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, కొత్తగా సమకూర్చాల్సిన సదుపాయాలపై అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవలను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన అన్ని వసతులు సమకూర్చాల్సిందిగా సంబంధిత మంత్రికి నివేదిస్తామని తెలిపారు. వివిధ వైద్య సేవల కోసం ప్రతిరోజు సగటున 2వేల మంది వరకు రోగులు వస్తున్నారని దీన్ని దృష్టిలో పెట్టుకొని అన్ని విభాగాల పనితీరును మెరుగుపరిచేలా అవసరమైన వైద్యులు, సిబ్బందితో పాటు అధునాతన వైద్య పరికరాలు మంజూరు చేయాల్సిందిగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహా దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఆసుపత్రిని నిర్మించి 14ఏళ్ల వ్యవధి అవుతున్నందున నిర్మాణ పరమైన లోపాలను చక్కదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. జీజీహెచ్‌తోపాటు బోధన్, ఆర్మూర్, తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో నెలకొని ఉన్న ఇబ్బందులను అధిగమించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషిచేస్తామని తెలిపారు. మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యేవెంట ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ శాఖ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశవేణు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజశ్రీ, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమరాజ్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న సుదర్శన్‌రెడ్డి

నగరంలో ముమ్మర తనిఖీలు

- పోలీసుల అదుపులో అనుమానితుడు
- 18 వాహనాలు స్వాధీనం

ఖిల్లా, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తనిఖీల్లో భాగంగా జిల్లా కేంద్రంలో పోలీసులు శనివారం సాయంత్రం తనిఖీలు చేపట్టారు. నిజామాబాద్ ఏసీపీ ఎల్.రాజవెంకటరెడ్డి నేతృత్వంలో ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి ఆధ్వర్యంలో నగరంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్‌స్టాండ్, రద్దీగా ఉండే ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. ఎటువంటి పత్రాలు లేని 18 వాహనాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు అనుమానాస్పదంగా ఉన్న ఓ వ్యక్తిని సైతం అదుపులోకి తీసుకున్నారు. రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుల వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వీరయ్య, ఎస్‌ఐలతో పాటు వంద మంది ప్రత్యేక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

మంత్రి గారూ జర ఇటు చూడరూ..

పేరుకే పెద్దాసుపత్రి

నిండా సమస్యలే..!

- జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, వంద పడకల ఆసుపత్రుల్లో వైద్యుల కొరత
- నేడు జిల్లాకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా రాక



జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి

ఆసుపత్రిలో పగిలిన డ్రైనేజీ పైపులు, లీకేజీలు

మంత్రి పర్యటన నేపథ్యంలో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సర్కారు వైద్యం పేదలకు అందని ద్రాక్షలాగే ఉంటుంది. పేదలకు వైద్యం అందించేందుకు ఏర్పాటుచేసిన ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయి. ప్రైవేటులో వేలాది రూపాయలు ఖర్చుపెట్టలేని పేదవారు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం అందక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలో బోధన్, ఆర్మూర్, భీంగల్‌లలో వంద పడకల ఆసుపత్రులు ఉండగా, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో మాత్రం 700 పడకల ఆసుపత్రి ఉంది. పేరుకే పెద్దాసుపత్రులు ఉన్నా వాటిలో అన్నీ సమస్యలు ఉంటున్నాయి. వంద పడకల ఆసుపత్రులకు వైద్యులు లేక తగినంత సిబ్బంది లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి పేరుకు ఏడంతస్తుల భవనం అయినా అన్నీ సమస్యలే కనబడుతున్నాయి. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందుబాటులో ఉండాల్సిన మందులు లేక రోగులు బయటనుంచి మందులు కొనుక్కునే పరిస్థితి ఉంది. ఈ ఆసు పత్రిలో అత్యాధునిక పరికరాలు ఉన్న అవన్నీ నిరుపయోగంగా ఉంటున్నాయి. సిబ్బంది కొరత అధికంగా ఉండటంతో పేదలకు వైద్యం అందడం లేదు. ఆదివారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా జిల్లాకు వస్తున్న సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి, మెడికల్ కళాశాల, బోధన్, ఆర్మూర్, భీంగల్ వంద పడకల ఆసుపత్రులవైపు ఒకసారి చూసి వాటిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

• జీజీహెచ్ అగమాగం..

జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రి నిండా సమస్యలే ఉన్నాయి. ఈ ఆసుపత్రికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పొరుగురాష్ట్రాల నుంచి కూడా రోగులు వస్తారు. గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జిల్లాకు మెడికల్ కళాశాల కేటాయించగా అప్పటి ప్రభుత్వ ఆసుపత్రిని మెడికల్ కళాశాలకు కేటాయించి నూతనంగా ప్రస్తుతం ఉన్న ఆసుపత్రిని నిర్మించారు. సుమారు 12 ఏళ్ల క్రితం ఏడంతస్తుల భవనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి ప్రస్తుతం అస్తవ్యస్థంగా మారింది. సరైన పర్యవేక్షణ లేక కొత్త ఆసుపత్రి పాత భవనాన్ని తలపిస్తుంది. ఆసుపత్రి నిండా లీకేజీలే కనిపిస్తున్నాయి. 700 పడకల ఆసుపత్రి అయిన జిజిహెచ్‌లో మొత్తం 281 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా రెగ్యూలర్ సిబ్బంది 104 మందే ఉన్నారు. కాంట్రాక్టు సిబ్బంది 69 మంది ఉండగా 108 ఖాళీలు ఉన్నాయి. ప్రొఫెసర్ (తరువాయి 8వ పేజీలో...)

నేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

● హాజరుకానున్న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న ఆసుపత్రి భవనం

రెంజల్,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభించనున్నట్లు మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు మొబిన్ ఖాన్ తెలిపారు. 1.56కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన భవనాన్ని ప్రారంభించడానికి వస్తున్న వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి వస్తున్నారని ఈ కార్యక్రమానికి మండలంలోని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు హాజరై సభను విజయవంతం చేయాలన్నారు. పూర్వం నిర్మించిన ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం నూతన భవనానికిశ్రీకారం చుట్టిందని, నూతన ఆరోగ్య కేంద్రం నిర్మించడం పట్ల మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు



ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన టీమ్

కోటగిరి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): పొతంగల్‌లో మంజీర నది నుంచి ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఆదేశాల మేరకు టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతీరోజు రాత్రి 9గంటల నుంచి ఉదయం వరకు పోలీసు, రెవెన్యూ సిబ్బందితో కలిసి ప్రత్యేక టీమ్ పర్యటిస్తుందన్నారు. మండలంలోని సుంకిని, కారేగాం, కొడిచర్ల, పొతంగల్, హంగర్గ మంజీర నది ప్రాంతాలలో ఈ టీమ్ పర్యటిస్తుందని ఆయన తెలిపారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వాహనాలను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌లకు తరలిస్తామన్నారు. యాజమానులపై క్రిమినల్ కేసులు పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక అవసరం ఉన్న వారు డీడీలు చెల్లిస్తే అనుమతులు ఇస్తామని అక్రమ రవాణాకు దూరంగా ఉండాలని సూచించారు.

రుద్రూరులో యువకుడికి దేహశుద్ధి

కోటగిరి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): రుద్రూరుమండల కేంద్రంలో ఓ వర్గానికి చెందిన యువకుడికి శనివారం గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. గ్రామానికి చెందిన ఓ వర్గానికి చెందిన యువకుడు ఓ వివాహితకు మాయమాటలు చెప్పి లోబర్చుకునే ప్రయత్నం చేశాడు. గత మూడు నెలలుగా ఈ తంతు కొనసాగడంతో వివాహిత కుటుంబ సభ్యులు గుర్తించారు. శనివారం గ్రామంలో ఆ యువకుడు కనబడడంతో దేహశుద్ధి చేసి బస్టాండ్ ప్రాంగణంలో క్షమాపణలు చెప్పించారు. దేహశుద్ధి చేసిన అనంతరం పోలీసులకు అప్పజెప్పారు. ఈ విషయమై పోలీసులకు బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

మంత్రి రాక ఏర్పాట్ల పరిశీలన

రెంజల్,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): నేడు మండల కేంద్రంలోని రూ.1.56కోట్ల వ్యయంతో నిర్మించిన నూతన ఆసుపత్రిని ప్రారంభించేందుకు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిలు కార్యక్రమానికి హాజరుకానుండడంతో ఏర్పాట్లను మండల ప్రత్యేక అధికారి వాజీద్ హుస్సేన్, తహసీల్దార్ శ్రావణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. సభ ఏర్పాట్లకు సంబంధించిన పూర్తి ఏర్పాట్లు, పర్యవేక్షణ తీరును పరిశీలించారు. సభ ఏర్పాట్లపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్, సూపరిండెంట్ శ్రీనివాస్, ఎంపీవో రఫీ, చిలుక అశోక్ తదితరులున్నారు.

ఇసుక లారీ పట్టివేత

మోర్తాడ్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి):అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని పట్టుకున్నామని ఎస్సై విక్రం తెలిపారు.ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా తరలిస్తున్న లారీని పట్టుకున్నామని డ్రైవర్‌ను పట్టుకున్నామని తెలిపారు. పట్టుకున్న లారీని రెవెన్యూ అధికారులకు స్వాధీనం చేసుకున్నామని ఎస్సై తెలిపారు.

కబడ్డీ పోటీలకు కృష్ణవేణి పాఠశాల విద్యార్థి

ముప్కాల్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న ముప్కాల్ మండలంలో నిర్వహించిన జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన బాల్కొండ కృష్ణవేణి పాఠశాల విద్యార్థి స్నేహరెడ్డి ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి అండర్-20 బాలికల కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కర్షన్ తెలిపారు. నేటి నుంచి 25వ తేదీ వరకు హైదరాబాద్ హకీంపేటలో జరిగే రాష్ట్రస్థాయి అండర్-20 కబడ్డీ పోటీల్లో స్నేహరెడ్డి జిల్లా జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనుంది. ఈ సందర్భంగా విద్యార్థి స్నేహిరెడ్డిని, వ్యాయమ ఉపాధ్యాయుడు గణేష్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కర్షన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

బోధన్ కోర్టులో ప్రభుత్వ న్యాయవాదుల నియామకం

బోధన్‌రూరల్,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలో గల కోర్టులో శనివారం ప్రభుత్వ న్యాయవాదులను నియమిస్తూ రాష్ట్ర న్యాయ శాసన వ్యవహారాల కార్యదర్శి ఉత్తర్వులను జారీ చేశారు. బోధన్ 5వ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు అదనపు ప్రభుత్వ న్యాయవాదిగా మహ్మద్ గౌసోద్దీన్, సీనియర్ సివిల్ జడ్జి, జూనియర్ సివిల్ జడ్జి కోర్టులకు సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా బొగ్గుల రవీందర్, బోధన్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా బోనాల మాధవిలతలను నియమించారు. ఈ సందర్భంగా నూతన ప్రభుత్వ న్యాయవాదులుగా నియామకమైన వారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గేదెను కాపాడిన స్థానికులు



కొట్టుకుపోతున్న గేదె

నవీపేట,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీ పంచాయతీ పరిధిలో భరత్ నగర్ తండా సమీపంలో ఉన్న అలీసాగర్ కాలువలో శనివారం గేదె కొట్టుకుపోతుండగా స్థానికులు కాపాడారు. గేదె అవతలి ఒడ్డు నుండి ఇవతలి ఒడ్డుకు దాటడానికి కాలువలో దిగి వస్తుండగా ఆకస్మాత్తుగా అలీసాగర్ కాలువ నీటి ప్రవాహం రావడంతో గేదె కొట్టుకుపోసాగింది. వెంటనే స్థానికులు అప్రమత్తమైన తాడు సహాయంతో గేదెను ఒడ్డుకు తరలించారు.

ట్రెస్మ సభ్యత్వ నమోదు

ఆర్మూర్‌టౌన్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో శనివారం ట్రెస్మ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రమణ రెడ్డి మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగులకు అండగా ఉంటామని, తమ సమస్యల పరిష్కారంలో ముందుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గజానన్, డిప్యూటీ తహసీల్దార్ హరిష్, ఆర్ఐ దశరథ్, వేణు, ధనుంజయ్; విక్రం, కిశోర్, ప్రదీప్, సందీప్, స్వరూప, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పర్యవేక్షణ లోపం చిన్నారులకు శాపం



రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఎడపల్లి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి మినీలో తేది 18న ప్రచురితమైన పర్యవేక్షణ లోపం చిన్నారులకు శాపం అనే కథనానికి స్పందన లభించింది. ఈ కథనానికి స్పందిస్తూ ఉన్నత స్థాయి అధికారుల ఆదేశాల మేరకు ఎడపల్లి తహసీల్దార్ ధన్వాల్ అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించారు. అందులో రెండు అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది సరిగ్గా పని చేయకపోవడం వలన వారిని పిలిచి హెచ్చరించారు.

రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలి

● రైతులు చెరకు పంటను సాగు చేస్తే ఏడాది లోపే బోధన్ చక్కెర కర్మాగారాన్ని తెరిపిస్తాం : బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



కోస్లీలో అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీటిని విడుదల చేస్తున్న బోధన్ ఎమ్మెల్యే సు

నవీపేట,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): రైతులు వరిపంటతో పాటు ఇతర ప్రత్యామ్నాయ పంటలను సైతం సాగు చేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోస్లీ గోదావరి వద్ద ఉన్న అలీసాగర్ ఎత్తిపోతల పథకం ద్వారా స్విచ్ ఆన్ చేసి యాసంగి పంటలకు సంబంధించి ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు. నిజాంసాగర్ చివరి ఆయకట్టు ప్రాంతానికి సక్రమంగా సాగునీరు అందకపోవడంతో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయంలో తాము అలీసాగర్ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. రైతులు వరిపంటతో పాటు చెరకు పంటను సైతం సాగు చేయాలని, చెరకు సాగు విస్తీర్ణం పెరిగితే సంవత్సరం లోపే బోధన్ చక్కెర కర్మాగారాన్ని తెరిపించడానికి తాము కృతనిశ్చయంతో ఉన్నామని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించి చక్కెర కర్మాగారాంకు చెందిన రూ.200 కోట్ల రుణాన్ని ప్రభుత్వం ఈ పాటికే చెల్లించిందని ఆయన వివరించారు. తీగజాతి కూరగాయల సాగు చేపట్టిన రైతులకు 50శాతం సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని ఆయన వివరించారు.తాను గతంలో వైద్య, విద్య శాఖ మంత్రిగా పని చేసిన సమయంలో నిజామాబాద్‌లో మెడికల్ కళాశాలను నిర్మించడం జరిగిందని అన్నారు. ఆదివారం రోజున రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ జిల్లా పర్యటన జరుపనున్నారని దీనికి సంబంధించి నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ప్రభుత్వ ఆసుపత్రుల లో ఖాళీగా ఉన్న వైద్య సిబ్బంది పోస్టుల భర్తీతో పాటు ఇతర సదుపాయలు, సౌకర్యాల కల్పనపై మంత్రికి వివరించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అంతకు ముందు మండలంలోని శాఖాపూర్ ఎత్తిపోతల పథకం ద్వారా ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర రైతు కమీషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, నిజామాబాద్ ఏఎంసీ వైస్ చైర్మన్ రాంచందర్, శ్రీనివాస్ గౌడ్, రాజేందర్ గౌడ్, మహిపాల్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, బాలరాజ్ గౌడ్, సంజీవ రావు, కిరణ్, శ్రీధర్ బాబు, ఇరిగేషన్ ఎస్ఈ భద్రీ నారాయణ, ఈఈ బలరాం, ఏఈ ప్రణయ్ రెడ్డి తదితరులున్నారు.

యోగా,ధ్యానం దినచర్యలో భాగం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ పీడీ సురేందర్

కామారెడ్డిటౌన్,డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి):యోగ,ధ్యానం దినచర్యలో భాగంకావాలని డీఆర్‌డీఓ పీడీ సురేందర్ అన్నారు. శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకుని శనివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని యోగభవన్‌లో యోగ కార్యక్రమాన్ని నిర్వహించగా అందులో ఆయన పాల్గొని మాట్లాడారు. శారీరకంగా ధృడంగా ఉన్న మానసికంగా ధృడంగా లేకపోతే చాలా అనర్థాలు జరుగుతాయని దానికి ధ్యానం ఒక్కటే మార్గమని తెలిపారు. ఒక వ్యక్తి బాగుంటే ఆ కుటుంబం బాగుంటుందని ఆ గ్రామం బాగుంటుందని తెలిపారు. చాలామంది డబ్బు కొరకు వెంపర్లాడుతూ ఆరోగ్యాన్ని వింత పోకడలో చేతులరా నాశనం చేసుకుంటున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా యోగాసన స్పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి,గిరిపల్లి అంజయ్య గుప్తా,అసిస్టెంట్ లేబర్ కమీషనర్ కోటేశ్వర్లు, అంతిరెడ్డి, పి.అంజయ్య అనిల్‌రెడ్డి,రమేష్,గంగాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ధ్యాన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ అచార్యులు రాజ్‌కుమార్, లత, యాదగిరి, మధు, రాజన్న, స్వరూపరాణి, సాగర్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఏర్గట్ల: ధ్యానం ఒత్తిడి నుండి విముక్తి చేస్తుందని, ప్రతీ ఒక్కరు రోజు ధ్యానం చేస్తే అనేక లాభాలు ఉంటాయని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, నలంద పాఠశాలల్లో అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మునీరుద్దీన్, పవన్, ప్రవీణ్ శర్మ, నలంద పాఠశాల కరస్పాండెంట్ రంగు వెంకట్ గౌడ్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీర్కూర్: బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. మానసిక, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ధ్యానం ఎంతో మేలు చేస్తుందని ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. దీన్ని గుర్తించిన ఐక్యరాజ్య సమితి డిసెంబర్ 21ను ప్రపంచ ధ్యాన దినోత్సవంగా ప్రకటించిందన్నారు. ఈ మేరకు నేడు మొదటి ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులు ధ్యానం చేశారు.

బిచ్కుంద: పరిపూర్ణ ఆరోగ్యానికి ధ్యానం ఎంతో అవసరమని ఓంశాంతి బ్రహ్మకుమారి రాజయోగి అన్నారు. శనివారం మండలంలోని మిషన్‌కల్లాలి గ్రామంలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని ధ్యానం వచ్చే లాభాలను వివరించారు. మానసికంగా,శారీరకంగా ఆరోగ్య విషయాల పరంగా నిరుత్సాహానికి గురైన వారందరు ధ్యాన పద్దతిలో ఉల్లసవంతమైన ఆరోగ్యాన్ని పొందవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారి ఉష తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి: ప్రతిరోజు యోగాతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలరని ఇంటర్నేషనల్ యోగాగురువు రాములు అన్నారు. ఆయన మండలంలోని దేమికలాన్ హైస్కూల్ ప్రాంగణంలో విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించారు. యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుంది. యోగా ద్వారా భారత దేశం విశ్వానికే గురువు అయిందన్నారు. ఈ కార్యక్రమాల్లో సుధాకర్‌రావు,నారాయణ, అనిల్, మనోహర్ రావులు పాల్గొన్నారు.

నేర ప్రవృత్తిని కలిగి ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండాలి

● అడిషనల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సాయిశివ



కోటగిరిలో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ న్యాయాధికారి సాయిశివ

కోటగిరి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): నేర ప్రవృత్తిని కలిగి ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండాలని బోధన్ అడిషనల్ జూనియర్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సాయిశివ సూచించారు. కోటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20ఏళ్ల లోపు విద్యార్థిని, విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తమకు భద్రత విషయంలో ఎలాంటి అనుమానాలు వచ్చిన వెంటనే డయల్ 100కు కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. విద్యార్థినులకు ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, పోక్సో, షీ టీమ్, సైబర్ నేరాలు, సెల్‌ఫోన్ వినియోగం వల్ల అనర్థాలు,ఆన్‌లైన్ మోసాలు, బాల్య వివాహలు అంశాలపై అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థికి ఇంటర్మీడియట్ దశ ఎంతో కీలకమైందన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత చదువులు చదివి తల్లిదండ్రుల ఆశలు, ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఈవ్‌టీజింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. కళ్ల ముందు ఏదైనా నేరం జరిగితే పోలీసులకు తప్పకుండా సమాచారం అందించాలన్నారు. చదువుతో పాటు క్రమశిక్షణ కలిగి ఉండి తల్లిదండ్రులు, పెద్దలు, గురువులను గౌరవించాలన్నారు. విద్యార్థులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు చెప్పే మాయ మాటలకు మోసపోవద్దని సూచించారు. ఎవరిపైన అయిన అనుమానం ఉన్నట్లయితే ఎవరినైనా వేధించిన, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడిన, ఉద్దేశపూర్వకంగా వెంబడించిన సమాచారం అందించాలన్నారు. కోటగిరి, పొతంగల్ మండలాల పరిధిలో బాల్య కార్మిక కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయని వీటిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూకృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ న్యాయాధికారి పూజిత, బోధన్ టౌన్ సీఐ వెంకట నారాయణ, కోటగిరి ఎస్ఐ సందీప్, కళాశాల ప్రిన్సిపాల్ కైసర్‌పాషా,అధ్యాపకులు ప్రమోద్, అనిల్,దత్తాత్రి పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అంతటా పాఠశాలలో ఆహార దినోత్సవం



శెట్పల్లిలో విద్యార్థులు నిర్వహించిన ఆహారోత్సవాన్ని తిలకిస్తున్న ఎంఈవో

లింగంపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి: మండలం లోని శెట్పల్లి కాంప్లెక్స్ పాఠశాలలో శనివారం తెలంగాణ ఆహారోత్సవం సందర్భంగా విద్యార్థులు రకరకాల వంటకాలను తయారుచేసి ప్రదర్శించారు. విద్యార్థులు తయారుచేసిన వంటకాల రుచిని ఎంఈవో శౌకత్‌అలీ, కాంప్లెక్స్ హెచ్‌ఎం వసుధ, పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని రుచిని చూసి వంటకాలను కొనుగోలు చేసి విద్యార్థులను ఉత్సాహపరిచి అభినందించారు. జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ముందస్తుగా చిన్నారులు నిర్వహించిన గణిత ప్రదర్శనను, ప్రాజెక్టును చూసి విద్యార్థులను అభినందించారు. ఎంఈవో మధ్యాహ్నబోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందిచాలని ఆయన సూచించారు.

ముప్కాల్: ముప్కాల్, బాల్కొండ మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ఆహార దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర విద్యశాఖ ఆదేశాల మేరకు తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు ఆహార దినోత్సవాన్ని నిర్వహించారు. బాల్కొండ మండల కేంద్రం, ముప్కాల్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఎంఈవో ఆధ్వర్యంలో విద్యార్థుల పౌష్టికాహారం గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు నువ్వుల ఉండాలు, సకినాలు, ఆహార పదార్థాలు, పిండి పదార్థాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మోర్తాడ్: మండల కేంద్రంలోని బాలికల ఉన్న పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాలమేరకు తెలంగాణ ఆహార దినోత్సవ వేడుకలను నిర్వహించారు. విద్యార్థులు తెలంగాణ సాంస్కృతిలో భాగమైన పలు రకాల వంటకాలను, పిండి పదార్థాలను వాటి ఇంటిలో తయారు చేసుకని తీసుకువచ్చారు. ఈ ఆహార పదార్థాలు, వంటకాలను డైనింగ్‌హాల్‌లో విద్యార్థులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకర్, బాల రాజు, ఉపాధ్యాయలు ఉన్నారు

కేటీఆర్‌తోనే రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయి



ఏర్గట్లలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

ఏర్గట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ ఆర్‌పై బురద జల్లడానికే అక్రమ కేసులు పెడుతున్నారని బీఆర్ఎస్ నాయకలు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ఫార్ములా రేస్‌ను ప్రపంచంలోని గొప్ప నగరాలను కాదనుకొని హైదరాబాద్‌కు తీసుకొచ్చిన ఘనత కేటీఆర్‌దేనని, దీని వల్ల రాష్ట్రానికి అనేక పెట్టుబడులు వచ్చాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను దృష్టి మల్లించడానికి కేటిఆర్‌పై ఏసిబి అక్రమ కేసులు వేయడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ కార్య క్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ సింగసారాం గంగారాం, గ్రామశాఖ అధ్యక్షుడు ఈరపట్నం నర్సయ్య, ఎండీ ఆశ్రఫ్, జైనోద్దీన్, క్యాతం దేవేందర్, రొక్కెడ మోహన్, గన్నారపు రాజేశ్వర్, అట్ల పోచయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎజిలిటి సంస్థ వార్షికోత్సవంలో కుకునూర్ విద్యార్థులు



ఎజిలిటి సంస్థ వార్షికోత్సవంలో విద్యార్థులకు బహుమతులు

వేల్పూర్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో జరిగిన ఎజిలిటి సంస్థ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ కార్యక్ర మాలలో వేల్పూర్ మండలం కుకునూర్ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. గ్రామానికి చెందిన ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎజిలిటి సంస్థ దత్తత తీసుకున్న విషయం తెలిసిందే. ఆ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ఈ పాఠశాలలకు చెందిన విద్యార్థులు వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచినట్లు హెచ్‌ఎం హరిచరణ్, నరేందర్‌లు తెలిపారు. ఈ సంస్థ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు విద్యార్థులను ప్రత్యేకంగా అభినందిస్తూ బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్‌లో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం



అమిత్‌షా దిష్టిబొమ్మ శవయాత్ర నిర్వహిస్తున్న మాలసంఘ సభ్యులు

వేల్పూర్,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): ఒక రాజ్యాంగ బద్ధమైన హోంమంత్రి పదవిలో ఉండి భారత పార్లమెంట్ సాక్షిగా ప్రపంచ మేధావి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యాలను ఖండిస్తూ శనివారం వేల్పూర్ మండల కేంద్రంలో మాల సంఘం, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు మాల సంఘం, అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మను పాడేపై ఉంచి గ్రామంలోని ప్రధాన వీధులగుండా శవయాత్ర ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాల సంఘం, అంబేద్కర్ యువజన సంఘం, మైనారిటీ సంఘం,వేల్పూర్‌లోని యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

మెండోర: భారత రాజ్యాంగాన్ని రచించి భారతదేశానికి దశ దిశా నిర్దేశం చేసిన మహానుభావుడు ప్రపంచ మేధావి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు అవమానించిన కేంద్ర మంత్రి అమిత్‌షాను తక్షణమే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేసి రాజద్రోహం కేసు నమోదు చేయాలని అంబే ద్కర్ యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తహరి గంగాధర్, మాకూరి గణేష్, శేఖర్, మహేష్, సుదీర్, సాయి, శ్రీనివాస్, కపిల్, నిషాంత్, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌రూరల్: భారత రాజ్యంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్‌షా దిష్టిబొమ్మను శనివారం మండలంలోని బడాభీమ్‌గల్ గ్రామంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను శవయాత్ర నిర్వహించి దహనం చేశారు.ఈ కార్యక్రమంలో సుమన్, చిత్తారి రాజేశ్వర్, కొండూర్ నవీన్, దళజత సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండల కేంద్రంలోని ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి అమిత్‌షా భారత రాజ్యంగ నిర్మాత బీఆర్.అంబేద్కర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యాలపై నిరసనగా శనివారం బాల్కొండలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ మండల అధ్యక్షుడు నిశాంత్, రజనీకాంత్, మురళీ, తదితరులు పాల్గొన్నారు.

చెట్లు ఎండిపోకుండా చూడాలి



మోర్తాడ్‌లో డివైడర్‌పై నాటిన చెట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వేముల

మోర్తాడ్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సెంట్రల్ లైటింగ్ డివైడర్లపై నాటిన చెట్లు ఎండిపోకుండా చూడాలని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన సుంకెట్ గ్రామం నుంచి వస్తుండగా మోర్తాడ్ వద్ద డివైడర్ మధ్యలో నాటిన చెట్లను పరిశీలించారు. పంచాయతీ అధికారులు చెట్లకు క్రమం తప్పకుండా నీళ్లు పట్టించాలని ఆయన ఆదేశించారు. ఎంపీడీవోకు ఆదేశాలు జారీ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

పొతంగల్‌లో పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలి

కోటగిరి,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): పొతంగల్ మండలం ఏర్పడి రెండు సంవత్సరాలు కావస్తున్న పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయకపోవడం సరికాదని బీజేపీ నాయకులు భజరంగ్ హన్మాండ్లు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ మల్లయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 15కు పైగా గ్రామాలు ఉన్నాయన్నారు. గ్రామాలలో శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఠల్, శంకర్, లక్ష్మణ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



శంకర్ (ఫైల్)

నసురుల్లాబాద్,డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నసురుల్లాబాద్ మండలం మైలారం గ్రామానికి చెందిన గొండ్ల శెంకర్ (36)గత 15 రోజుల క్రితం తన పొలంలో నీరు పారపెటుకుంటుండగా కరెంట్ షాట్ జంపర్ తగిలి నిజామాబాద్ ఆసుపత్రిలో చేరారు.గత 15 రోజుల నుంచి చికిత్స పొందుతూ శనివారం మృతి చెందడం జరిగిందని గ్రామస్తులు పేర్కొన్నారు. కాగా మృతునికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని వారు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి శవ పంచనామ నిర్వహించి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులు గణిత శాస్త్రంపై ఆసక్తిని పెంచుకోవాలి

● మండల విద్యాశాఖ అధికారి నాగయ్య



గణిత మేళను పరిశీలిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గణితం అంటే భయాన్ని వీడి ఆసక్తిని పెంచుకోవాలని బోధన్ మండల విద్యాశాఖ అధికారి నాగయ్య అన్నారు. శనివారం జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎండీ ఆరీఫ్ అధ్యక్షతన గణిత మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గణితం అంటే భయపడవద్దన్నారు. గణిత మేళ విద్యార్థుల్లో సృజనాత్మకత ఉద్దీపించే విధంగా ఉందని పేర్కొన్నారు. పిల్లలు గణితంలో వెనుక బడుతున్నారని, గణిత మేళ విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ నరేందర్, రమేష్ రెడ్డిలతో ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: గణితశాస్త్రవేత్త శ్రీనివాస్ రామానుజన్ జయంతి సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల పాఠశాలలో శనివారం గణిత దినోత్సవాన్ని విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు గణిత టాలెంట్ టెస్ట్, గణిత టీచింగ్, గణిత లెర్నింగ్ మెటిరియల్‌ను తయారు చేశారు. దీంతో పాఠశాల విద్యార్థులు రంగోళిలో పాల్గొన్నారు. రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. పాఠశాలలో గణితం బోధించే ఉపాధ్యాయులను శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం ఘనంగా గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకొని విద్యార్థులకు గణిత రంగోళి, ఫుడ్‌మేళతో పాటు క్విజ్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.నరేందర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెర్కిట్: ఆర్మూర్ పట్టణంలోని మామిడిపల్లి నలంద,జెంటిల్‌కిడ్స్,లిలిపుట్స్ హైస్కూల్‌లో శనివారం భారత గణితశాస్త్రవేత్త శ్రీనివాసరామనుజన్ జన్మదినం పురస్కరించుకొని గణితశాస్త్ర దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులందరు సుమారు వంద ప్రాజెక్టులను ప్రదర్శించి ఆలరించారు.విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్: పెర్కిట్ ప్రభుత్వ పాఠశాలలో శనివారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం ఎన్.శ్రీనివాస్, గణిత ఉపాధ్యాయుడు లక్ష్మణ్, శ్రీనివాస్‌రావు, ఉపాధ్యా యులు పోచన్న, సుజాత, బాజన్న, వెంకటమరణచారి, రాధబాయి, పాల్గొన్నారు.

ముప్కాల్: బాల్కొండ మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో గణిత శాస్త్రవేత్త శ్రీనివాసరామనుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గణితంపై శ్రీనివాస రామానుజన్ చేసిన కృషి ని విద్యార్థులకు వివరించారు. మైనారిటీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలలో గణితం బోధనపై, విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెంపొందించుకోవడానికి, విద్యార్థులు తయారు చేసిన గణిత నమూనాలను పలువురిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ చందన, ఉపాధ్యాయలు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

లేఆఫ్‌కు తొమ్మిదేళ్లు!



● నిజాం షుగర్ ఫ్యాక్టరీ మూతతో రోడ్డున పడ్డ కార్మికులు ● రాజకీయ పార్టీలకు ఎన్నికల ప్రచార అస్త్రంగా లేఆఫ్ వ్యవహారం

అదొక చారిత్రాత్మక ఫ్యాక్టరీ. ఆసియాలోనే అతిపెద్ద కర్మాగారంగా గుర్తింపు పొందింది. ఒకప్పుడు ఈ ప్రాంత ప్రజలకు అదొక కల్ప తరువు. కాని కాలక్రమేనా యాజమాన్యం దాని భారం మోయలేమని చేతులు ఎత్తేసింది. అర్ధరాత్రి లేఆఫ్ ప్రకటించింది.. ఇంకేముంది ఫ్యాక్టరీ మూత పడింది. కార్మికులు రోడ్డున పడ్డారు. అయితే తాము అధికారంలోకి నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని వంద రోజుల్లో ప్రభుత్వపరం చేస్తామని కేసీఆర్ ఇచ్చిన హామీ నేటికి అమలుకు నోచుకోలేక కార్మికులు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. కాగా యాజమాన్యం ఫ్యాక్టరీకి లేఆఫ్ ప్రకటించి నేటితో తొమ్మిదేళ్లు పూర్తి కాగా.. రాజకీయ నాయకులకు మాత్రం అదొక ప్రచార అస్త్రంగా మిగిలిపోయింది.



అనారోగ్యం పాలైన కార్మికుడు పాషా

బోధన్‌రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆసియా ఖండానికే తలమానికంగా నిలిచిన బోధన్ నిజాంషుగర్స్ లేఆఫ్‌కు నేటితో తొమ్మిదేళ్లు. చెరకు రైతులకు తీపిని పంచిన చెక్కర కర్మాగారం నేడు రైతుల జీవితాల్లో చేదును నింపింది. ఖండాంతర ఖ్యాతి గడించిన నిజాంషుగర్స్ కర్మాగారం లేఆఫ్‌తో మూతపడింది. నిజాంషుగర్స్‌కు పూర్వ వైభవం తెస్తామని, ప్రభుత్వపరం చేస్తామని చెప్పిన పాలకులు నిజాంషుగర్స్‌ను నట్టేట్లో ముంచేశారు. నిజాం నవాబుల కాలంలో పురుడు పోసుకున్న నిజాంషుగర్స్ రోజురోజుకు విస్తరించి మూడు యూనిట్లుగా తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాల్లో విస్తరించింది. శక్కర్‌నగర్ మొదటి యూనిట్ కాగా దీనికి అనుబంధంగా మెదక్, మెట్‌పల్లిల్లో అనుబంధ యూనిట్లు ఏర్పాటు అయ్యాయి. లాభసాటిగా సాగి వేలాది మంది కార్మికులు, లక్షలాది మంది రైతుల జీవితాల్లో వెలుగులు నిం పిన కర్మాగారం నేడు చీకట్లు అలుముకుంది. నిజాంషుగర్స్ దుస్థితికి ప్రైవేటీకరణకు గత ప్రభుత్వాలే కారణమని బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే పూర్వ వైభవం వస్తుందని గత ఎన్నికల సమయంలో పాలకులు పదేపదే చెబుతూ వచ్చారు.

● ఎన్నికల్లో నాయకుల ప్రచారాస్త్రంగా..

2014నుండి ఎన్నికలల్లో నిజామాబాద్ జిల్లాలో మరి ముఖ్యంగా బోధన్ నియోజకవర్గంలో నిజాంషుగర్స్ వ్యవహారం ఎన్నికల ప్రచారం అన్ని పార్టీలకు అస్త్రంగా సాగింది. ప్రధాన రాజకీయ పార్టీలన్ని ఎన్నికల రాజకీయాన్ని నిజాంషుగర్స్ చుట్టే తిప్పాయి. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే నిజాంషుగర్స్‌కు పూర్వ వైభవం రావడంతో ప్రభుత్వపరం అవుతుందని కార్మికుల, రైతు ల కుటుంబాలకు న్యాయం జరుగుతుందని చెబుతూ వచ్చారు. గత ప్రభుత్వాలు, పాలకుల తప్పిదాలను నిజాంషుగర్స్ విషయంలో ఎత్తిచూపారు. కాని తొమ్మిదేళ్లు గడిచినప్పటికీ నిజాంషుగర్స్ విషయంలో ఎలాంటి పురోగతి కనిపించలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికే నిజాంషుగర్స్ కర్మాగారం లేఆఫ్ ప్రకటనకు గురైంది. ఎన్‌డీఎస్ఎల్ ప్రైవేటు యాజమాన్యం కర్మాగారం నడపలేమని లేఆఫ్ ప్రకటించి కర్మాగారాన్ని మూత పెట్టారు. తొమ్మిదేళ్ల కాలంగా లేఆఫ్ కొనసాగుతూనే ఉంది. వేతనాలు లేక వేలాది మంది కార్మికులు రోడ్డున పడ్డారు. వందలాది కార్మిక కుటుంబాలు ఆకలితో అలమటిస్తున్నారు. చెరకు రైతులు ప్రత్యామ్నాయం లేక చెరకు సాగుకు దూరమయ్యాయి. కొద్దిమంది రైతులు ఆశ చంపుకోలేక చెరకు సాగు చేసి మహరాష్ట్ర చెరకు కర్మాగారంతో పాటు కామారెడ్డి జిల్లాలోని పలు ప్రైవేటు చక్కెర ఫ్యాక్టరీలకు చెరకును తరలిస్తున్నారు.

● అర్ధరాత్రి లేఆఫ్ ప్రకటన

2015డిసెంబర్ 22న అర్ధరాత్రి లేఆఫ్ ప్రకటనతో కర్మాగారం మూత పడడంతో కార్మికులు రోడ్డున పడ్డారు. ప్రైవేటు యాజమాన్యం లేఆఫ్ ప్రకటించి తొమ్మిదేళ్లు పూర్తి కాగా అప్పటి నుంచి ఇప్పటి వరకు కార్మికులకు వేతనాలు కరువయ్యాయి. కర్మాగారం మూతపడడంతో కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారు. కార్మిక కుటుంబాలు అయోమయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. నిజాంషుగర్స్ లేఆఫ్‌కు సుమారు వందమందిపైనే కార్మికుల జీతాలు లేక రోడ్డుపైన పడ్డారు. నిజాంషుగర్స్ లేఆఫ్‌పై గత ప్రభుత్వాలు స్పందించకపోవడంతో అటు కార్మికులు, ఇటు రైతులు మండిపడుతున్నారు. లేఆఫ్‌కు తొమ్మిది సంవత్సరాలు పూర్తి కావడం కర్మాగారం భవితవ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. కార్మిక కుటుంబాలు దాదాపు దిక్కుతోచని పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. అర్ధరాత్రి లేఆఫ్ ప్రకటనతో కర్మాగారం మూతపడగా కార్మికులు రోడ్డున పడ్డారు. మరో వైపు చెరకు రైతులు చెరకు పంట సాగుకు దూరమయ్యారు. పంటను సాగు చేసిన కొద్దిమంది రైతులు చెరకు పంటను కామారెడ్డి జిల్లాలోని, ఇతర ప్రైవేటు కర్మాగారాలకు లేదంటే మహరాష్ట్రలోని చక్కెర కర్మాగారాలకు చెరకు తరలించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. పట్టించుకోవాల్సిన రాష్ట్ర ప్రభుత్వం లేఆఫ్‌పై కనీసం పట్టించుకున్న దాఖలాలు కనబడడం లేదు.

నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ

● ప్రభుత్వం వెంటనే కార్మికులను ఆదుకోవాలి

కుమారస్వామి, సీఐటీయూ కార్మిక సంఘ నాయకులు, బోధన్



కార్మికులు చాస్తుంటే యాజమాన్యం, ప్రభుత్వాలు చూస్తున్నారే కాని పరిష్కారం దిశగా ఆలోచించలేకపోతున్నారు. ప్రభుత్వం వెంటనే కార్మికులను ఆదుకుని రావాల్సిన వేతన బకాయిలు చెల్లించాలి. లేఆఫ్ అయినప్పటి నుంచి కార్మిక సంఘాల నాయకులు అధికారుల, రాజకీయ నాయకుల చుట్టు చెప్పులు అరిగేలా తిరుగుతున్నప్పటికీ ఎవరు పట్టించుకోవడం లేదు.

● నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించాలి

రవి శంకర్ గౌడ్, మజ్దూర్ సభ నాయకులు, బోధన్



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపించి కార్మిక కుటుంబాలను ఆదుకోవాలి. అనారోగ్యం బారిన పడిన కార్మికులు వైద్యం కోసం డబ్బులు లేక మంచాన పడ్డారు. తొమ్మిదేళ్లుగా వేతనాలు లేక కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. గతి లేక చిన్న, చితక పనులు చేసుకుంటున్నారు. ప్రభుత్వాలు స్పందించి నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని వెంటనే తెరిపించి కార్మికులను ఆదుకోవాలి.

● ఫ్యాక్టరీని తెరిపించేందుకు కృతనిశ్చయంతో ఉన్నాం

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు

ఫ్యాక్టరీని తెరిపించేందుకు కృతనిశ్చయంతో ఉన్నామని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ఇటీవల హామీ ఇచ్చారు. ఫిబ్రవరి 24వ తేదిన ఎన్నికలలో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని సందర్శించారు. రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగం చెరకు వేసి ప్రభుత్వానికి సహకరించాలన్నారు. బీఆర్ఎస్ నిర్ణయాల వల్లే ఫ్యాక్టరీ మూత పడిందని ఆరోపించారు. రైతులను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రజలు కోరుకున్న మార్పును చేసి చూపిస్తామన్నారు. నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ పునరుద్ధరణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందన్నారు.

ముగిసిన సీఎం కప్ క్రీడా పోటీలు

● చదువుతో పాటు క్రీడలకూ ప్రాధాన్యత ఇవ్వాలి
● అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్

సుభాష్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో ఏర్పాటు చేసిన సీఎం కప్ క్రీడా ముగింపు పోటీలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయన్నారు. సీఎం కప్ క్రీడలు గ్రామీణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఈ పోటీలను ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు ఏడు రోజుల పాటు ఈ క్రీడలను జిల్లా స్థాయిలో అట్టహాసంగా నిర్వహించారన్నారు. వివిధ క్రీడల్లో క్రీడాకారులు ప్రతిభను కనబర్చి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారని అన్నారు. ముఖ్యంగా క్రీడలను పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సహిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనేందుకు అవకాశం ఉంటుందన్నారు. 27న జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు మంచి ప్రతిభకనబర్చి జిల్లాకు మంచిపేరు తీసుకురావాలని అన్నారు. క్రీడలను తల్లిదండ్రులు సైతం ప్రోత్సహించాలని అన్నారు. శనివారం ఆట్యా పాట్యా, తైక్వాండో, నెట్‌బాల్ క్రీడా పోటీలను నిర్వహించారు. ఇందులో ప్రతిభకనబర్చిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సాయంత్రం పోటీల్లో ముగింపు కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం జిల్లా యువజన మరియు క్రీడల శాఖ అధికారి ముత్తెన్న మాట్లాడుతూ వారం రోజుల పాటు ఉత్సాహంగా క్రీడలు నిర్వహించామని అన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రతీరోజు వివిధ పోటీలు నిర్వహించామన్నారు. ప్రతిరోజు పోటీల నిర్వహణకు సహకరించిన వారందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘం నాయకుడు విద్యాసాగర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, వెంకట్, గోపిరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



మొదటి బహుమతి సాధించిన ఇందల్వాయి మండల కబడ్డీ మహిళా జట్టు



మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్

సీఎం కప్‌లో ఉషూ ఫైటింగ్...

సీఎం కప్ నిర్వహణలో ఉషూ అసోసియేషన్ నాయకుల మధ్య భారీ స్థాయిలో గొడవ జరిగింది. ఒకరినొకరు కలెక్టరేట్ గ్రౌండ్‌లోనే పిడిగుద్దులు గుద్దుకున్నారు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. శుక్రవారం ఉషూ ఎంపికలు నిర్వహించాల్సి ఉండగా ఉషూ సెక్రెటరీగా ఉన్న ఉమర్ ఉన్నారు. ఇటీవలే ముప్కాల్‌కు చెందిన మరో వ్యక్తికి ఉషూ సెక్రెటరీ బాధ్యతలు వచ్చాయని ఉషూ అసోసియేషన్ మాదంటే మాదని గొడవకు దిగారు. దీంతో జిల్లా క్రీడల శాఖ అధికారి ఇద్దరి అవసరం మాకు లేదని ఉషూ ఎంపికలు మేమే నిర్వహిస్తామని ఉషూ ఎంపికలను మొదలు పెట్టారు. పక్కన ఉన్న ఇరువర్గాల అసోసియేషన్ సభ్యులు చిన్న చిన్న మాటలతో గొడవకు దిగారు. తర్వాత గొడవ పెద్దదైంది. దీంతో ఒకరినొకరు పిడిగుద్దులు గుద్దుకున్నారు. అనంతరం నగరంలోని ఒకటవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. ఇదంతా ఇలా ఉంటే ఒలంపిక్ అసోసియేషన్ పెద్దలు ఇద్దరిని శనివారం సంధి చేసినట్లు సమాచారం.

ఉషూకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం కరువు

ఉషూ అసోసియేషన్ సభ్యుల గొడవతో జిల్లాకు ప్రాతినిధ్యం లేకుండా పోయింది. జిల్లా క్రీడల యువజన శాఖ అధికారి ఎంపికలు నిర్వహించాలని చూసిన అసోసియేషన్ మధ్య గొడవతో ఎంపికలు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో ఉషూ ఎంపికలు జరగలేదు. క్రీడాకారులు ఎంతో ఉత్సాహంతో ప్రతిభను చాటుదామని వచ్చిన క్రీడల ఎంపికలు నిర్వహించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. ఈ గొడవతో ఉషూ క్రీడాకారులు రాష్ట్రస్థాయికి వెళ్లలేకపోయారు.

సర్వ శిక్షా అభియాన్ కాంట్రాక్టు
ఉద్యోగుల సమస్యలు తీర్చండి



జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న సమ్మెలో పాల్గొన్న మద్నూర్ ఉద్యోగులు

మద్నూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యల సాధన కోసం సమగ్ర సర్వ శిక్ష కాంట్రాక్టు పద్ధతిన విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు 15 రోజులుగా సమ్మెలో కొనసాగుతున్నారు. మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రం పాఠశాలల సముదాయం, కేజీబీవీ, యూఆర్ఎస్ పాఠశాలలో పని చేసే కాంట్రాక్టు టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులు సభ్యులు ఉన్నారు. దీంతో మండల విద్యా వనరుల కేంద్రాలు, పాఠశాలలో కాంప్లెక్స్ విద్యాలయాల్లో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని ప్రధానమైన డిమాండ్‌లతో సమ్మెబాట పట్టారు. గతంలో ప్రభుత్వంలో లేనప్పుడు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు పరచాలని ఎస్ఎస్ఏ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు. విద్యా వనరుల కేంద్రంలో పనిచేసే ఎమ్మెస్ కోఆర్డినేటర్లు, డాటా ఆపరేటర్లు, మెసెంజర్లు, ఐఈఆర్పీలు, పాఠశాల సముదాయంలో పనిచేసే సీఆర్పీలు, పాఠశాల స్థాయిలోపార్ట్‌టైమ్ ఇన్స్ట్రక్టర్లు, కేజీబీవీ, యూఆర్ఎస్ఎమ్‌లు, అకౌంటెంట్స్ అటెండర్లు, కుక్‌లు, వాచ్‌మెన్‌లు, స్వీపర్లు, జిల్లాస్థాయిలో పనిచేసే ఏపీవోలు, సిస్టం అనాలాసిస్టులు, సాంకేతిక నిపుణులు, డిఎల్ఎంటీలు, కాంట్రాక్టు పద్ధతిలో నియామకమై సుమారు 10 ఏళ్ల నుంచి విద్యారంగంలో సేవలు అందిస్తున్నారు. పాఠశాల విద్యా మెరుగు కోసం నైపుణ్యాలతో కృషి చేస్తున్నారు. తక్కువ వేతనం పొందడం వల్ల ఆర్థికంగా వెనుకబడి ఇబ్బందులు పడుతున్నారు.

● ఇవీ ప్రధాన డిమాండ్లు

సమగ్ర శిక్ష ఉద్యోగులందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలి, తక్షణమే ఉద్యోగ భద్రతతో కూడిన పే స్కేలు ఇవ్వాలి. ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలి. ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ చేస్తున్న వారికి బెనిఫిట్స్ కింద రూ.25 లక్షలు ఇవ్వాలి, ప్రభుత్వం విద్యా శాఖలో నియమాకంలో వెయిటేజ్ కల్పించాలి, సమగ్ర శిక్ష ఉద్యోగులందరికీ రీ ఎంగేజ్ విధానాన్ని తీసివేయాలి. కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు సుమారు 700 వరకు ఉంటారని జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ వెల్లడించారు. ప్రభుత్వం తమ డిమాండ్లను అంగీకరించి వెంటనే చర్చలకు పిలిపించాలని కోరారు.

గ్రామాల్లో జోరుగా పేకాట

● గ్రామ శివారు ప్రాంతాలే పేకాట స్థావరాలు
● పట్టించుకోని పోలీసులు ● గ్రామాల్లో అవగాహన కరువు
● స్టేషన్‌కే పరిమితం అవుతున్న పోలీసులు

తాడ్వాయి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పలు గ్రామాల్లో పేకాట మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది. ప్రతీ గ్రామంలోని గ్రామ శివారులే అడ్డగా ఈ దందా కొనసాగిస్తున్నట్లు పలువురు బహిరంగంగానే చర్చించు కుంటున్నారు. గ్రామ శివారులోని పేకాట స్థావరాల్లో అన్ని వసతులు సౌకర్యాలు ఏర్పాటు చేసుకుని దర్జాగా పేకాట ఆడుతున్నారు. కానీ పోలీసులు ఏ మాత్రం పట్టించుకోకుండా చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరాలపై దాడి చేసి నగదును, పేక ముక్కలను, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కానీ స్వాధీనం చేసుకున్న డబ్బులు మొత్తం ప్రభుత్వానికి అప్పజెప్పకుండా ఏదో నామమాత్రంగా కొన్ని రూపాయలు మాత్రమే అప్పజెప్పి మిగతా రూపాయలు స్వాహా చేసినట్టు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఇలా అయితే పోలీసులపై ఉన్న నమ్మకం పోతుందని అంటున్నారు. పోలీసులు అంటేనే ప్రజలకు నమ్మకం అని, పోలీసులు అంటేనే విశ్వాసం అయినా పోలీసులు మాత్రం తమదైన శైలిలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఇక గ్రామాల్లోని భూతగాదాల్లో కూడా తలదూర్చి అందినంత కాడికి దండుకుంటున్నారని పలువురు బహిరంగంగానే చెప్పు కుంటున్నారు. పోలీసులే ఇలా చేస్తే ఎవరితో చెప్పుకోవాలో వారికే అర్థం కాక వారిలో వారే కుమిలి పోతున్నారు. ఎవరికైనా చెబితే ఇంకా కేసులు ఎక్కువ చేసి వేధిస్తారని భయంతో ఎవరికి చెప్పడం లేదని అంటున్నారు. పలు భూముల తగాదాలలో కూడా తల దూర్చి మధ్యవర్తుల సహాయంతో పెద్ద మొత్తంలోనే దండుకుంటున్నట్లు మండలంలో పలువురు చర్చించుకుంటు న్నారు. పలు గ్రామాల్లో పోలీసుల అవగాహన కరువైంది. గ్రామాల్లోని నేరాలు, దొంగతనాలు, బాల్యవివాహాలు, మద్యం, ధూమ పానంపైన పలు అవగాహన సదస్సు లు నిర్వహించాలని ప్రభుత్వం పదేపదే చెబు తున్న పోలీసులు మాత్రం స్టేషన్లకే పరిమితం అవుతున్నారు. ఇదంతా జరుగుతున్న పోలీసు అధికారులు మాత్రం చూసి చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు. ఒక పోలీస్ అధికారి తన బ్యాచేనని తాను ఏం చేసినా ఏం కాదని అపోహలో ఉంటున్నాడని పలువురు చర్చించుకుంటున్నారు. గ్రామంలో పోలీస్ వాహనాన్ని చూసి అన్నా ఇక్కడ ఎందుకు ఉన్నారని ఒక విలేఖరి అడుగగా నీకెందుకు నేనే పోలీసునని, నన్నే అడుగుతావా అని దురుసుగా సమాధానం ఇచ్చారు. ఒక విలేకరికే పోలీసులు ఇలా మాట్లాడితే మిగతా వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఒక పక్క పోలీసులు ప్రజలతో మమేకమై ఫ్రెండ్లీ పోలీసుగా నిర్వహించాలని చెబుతున్నారు కానీ మండలంలో దీనికి విరుద్ధంగా నడుస్తుందని పలువురు అనుకుంటున్నారు. ప్రజలపై నమ్మకం ఉన్న పోలీసులే ఇలా చేస్తే ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక జనాలు వారిలో వారి కుమిలిపోతున్నారు. ఇకనైనా పైఅధికారులు కలుగజేసుకొని పోలీసులు అంటే ప్రజల నమ్మకం ప్రజల విశ్వాసం అని నిరూపించేలా చేయాలని కోరుతున్నారు.

సిబ్బంది నియామకం జరిగేనా..!?



ఇందిరమ్మ ఇంటి నమూనా



ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో పాల్గొన్న కమిషనర్



గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

మద్నూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పర్యవేక్షణ బాధ్యతలపై సందిగ్ధం నెలకొంది. నియోజకవర్గానికి కనీసం మూడు నుంచి నాలుగు వేల ఇళ్లు మంజూరు చేయాలని సంకల్పిస్తుంది. ఈ నేపథ్యంలో వాటి నిర్వహణ బాధ్యతను పర్యవేక్షించే సిబ్బందిని ఇప్పటివరకు నియమించకపోవడంతో ఈ పథకం చూడటానికి ఎవరిని నియమిస్తున్నారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కామారెడ్డి జిల్లాకు ఇప్పటివరకు ఇద్దరు డీఈలను, ఇద్దరు ఏఈలను మాత్రమే ప్రభుత్వం నియమించినట్లు తెలుస్తుంది. ఈ పథకాన్ని పారదర్శకంగా నిర్వహించాలంటే క్షేత్రస్థాయిలో పకడ్బందీ వ్యవస్థ ఉండాలని సంకల్పిస్తున్న ప్రభుత్వం ఇప్పటివరకు ప్రాథమిక నిర్ణయాలు తీసుకోకపోవడం గమనార్హం.

● ఔట్ సోర్సింగ్ సిబ్బందితో ఇక్కట్లు..

గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అప్పట్లో రాష్ట్రంలో ప్రత్యేకంగా గృహ నిర్మాణ శాఖ ఉండేది. అందుకు జిల్లా కేంద్రంలో ఎస్ఈ, డీఈ, ఏఈలతో పాటు ప్రత్యేక విభాగాన్ని కేటాయించారు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ సంఖ్య అధికంగా ఉండటంతో ఐటీఐలలో డాక్యుమెంట్ విల్ చేసిన వాళ్లను అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించారు. ఈ క్రమంలో అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో కొంత మంది నాయకులు పదుల సంఖ్యలో తమ బంధువులను లబ్ధిదారు లుగా చేర్చి చెక్కులు డ్రా చేశారని ఆరోపణలు వచ్చాయి. ఇప్పటికీ అవి విచారణ దశలోనే ఉన్నాయి. ఇందిరమ్మ ఇళ్ల భాగోతంలో అధికారులతో సహా అవుట్ సోర్సింగ్ సిబ్బందిపై అనేక ఆరోపణలు ఉండటం గమనార్హం. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో కామారెడ్డి జిల్లాలో గడిచిన పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇస్తామని ఆ పార్టీ నాయకులు ఊదరగొట్టారు. రెండు దఫాలు గెలిచినప్పటికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు అర్హులైన వారికి ఇవ్వకపోవడంతో కాంగ్రెస్ ప్రభుత్వం లబ్ధిదారులకు ఆశలు కల్పించడంతో పేద జనం అనేక ఆశలు పెట్టుకున్నారు. అప్ప ట్లో జిల్లాలో కొన్ని నియోజకవర్గాలకు ఎక్కువ మొత్తంలో డబుల్ బెడ్ రూమ్‌లు ఇచ్చారన్న ఆరోపణలు సైతం వచ్చాయి. జిల్లాలో లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం ఎదురుచూస్తూ ఉంటారని ప్రభుత్వం భావిస్తుంది. అందుకుగాను రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఇందిరమ్మ ఇళ్లపై ప్రజా పాలనలో దరఖాస్తులను స్వీకరించారు. జిల్లాలో రెండు లక్షల 38 వేల 682 దరఖాస్తులు వచ్చాయి. మండలాల వారీగా దరఖాస్తులు ఇలా ఉన్నాయి. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలో 4,823, దోమకొండ 6,929, జుక్కల్ 13,761, నిజాంసాగర్ 10,243, పిట్లం 11,512, కామారెడ్డి మున్సిపాలిటీ 18,779, బిచ్కుంద 14,074, భిక్కనూర్ 11,009, రామారెడ్డి 8,284, బీబీపేట్ 66,715, బాన్సువాడ అర్బన్ 8,988, నస్రుల్లాబాద్ 6,487, మాచారెడ్డి 12,282, సదాశివనగర్ 9,833, కామారెడ్డి అర్బన్ 5,693, నాగిరెడ్డిపేట 7,764, మద్నూర్ 16,867, రాజంపేట 7,503, లింగంపేట్ 12,179, పెద్ద కొడప్గల్ 6,922, గాంధారి 13,806,, తాడ్వాయి 8,122, బీర్కూర్ 5,838, ఎల్లారెడ్డి అర్బన్ 6,660, ఎల్లారెడ్డి మున్సిపాలిటీ 3,718 దరఖాస్తులు చేసుకున్నారు.

● కుటుంబాల విభజన ఎలా

2005-09 సంవత్సరంలో ఉమ్మడి కుటుంబాలను పరిగణలోకి తీసుకొని ఇందిరమ్మ ఇల్లను కేటాయించారు. దాదాపు 13 ఏళ్లు గడిచిన తర్వాత ఉమ్మడి కుటుంబాలన్నీ కూడా ఏక కుటుంబాలుగా మారాయి. వారందరికీ ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తారా.. లేదా? అనే అంశంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలపై ఒత్తిడి నెలకొంది. ఇటీవల కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వైరం ముదరడంతో తమకు ఇందిరమ్మ ఇల్లు దక్కకుండా కొర్రీలు పెడతారేమో అని అనుమానం సామాన్య ప్రజల్లో నెలకొంది.

భూభారతిపైనే రైతుల ఆశలు

(ఐదవ పేజీ తరువాయి)

తీసుకునే అవకాశం ఉండటంతో తమ భూములకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రైతులు భావిస్తున్నారు. కొత్త భూభారతి చట్టం ప్రకారం తహశీల్దార్, ఆర్‌డీవో, అదనపు కలెక్టర్ రెవెన్యూ, కలెక్టర్ వద్ద నాలుగు స్టేజీల్లో భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేలా ఏర్పాట్లు చేస్తుండటంతో శాశ్వత పరిష్కారం దొరుకుతుందని రైతులు అంచనా వేస్తున్నారు. భూములకు సంబంధించిన చిన్న సమస్యలన్నీ తహశీల్దార్ స్థాయిలోనే పరిష్కారం అయ్యే అవకాశం ఇచ్చారు. కొన్ని ముఖ్యమైన భూసంబంధిత అంశాలు ఆర్‌డీవో పరిధిలో పరిష్కారం అయ్యేలా చట్టంలో పొందుపర్చారు. వీరిద్దరి వద్ద పరిష్కారం కాని కొన్నిభూసమస్యలు అదనపు కలెక్టర్ రెవెన్యూ, మరికొన్ని సమస్యలను కలెక్టర్ స్థాయిలోనే పూర్తయ్యేలా చట్టంలో మార్పులు తెచ్చారు. ఈచట్టం అమలుకు వస్తే 90శాతానికి పైగా భూ సమస్యలన్నీ జిల్లాస్థాయిలోనే పరిష్కారం కానున్నాయి. సాదాబైనామాల నుంచి ధరణిలో పేరు నమోదు వరకు తప్పులు జరిగిన అన్ని సమస్యలు తహశీల్దార్, ఆర్‌డీవో పరిధిలోనే ఎక్కువగా పరిష్కారం కానున్నాయి. కొత్తచట్టం అమలుకు మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉంది. అప్పటివరకు ధరణి ద్వారా పాత సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆర్‌డీవోస్థాయిలో ట్రిబ్యునల్ ఏర్పాటుతో భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం కూడా లభించనుంది.

భూభారతి వల్ల రైతులకు మేలు

● గడుగు గంగాధర్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు

భూభారతితో రైతులకు మేలు జరుగుతుంది. ధరణిలో ఇబ్బందులు పడ్డ రైతులకు పరిష్కారం దొరుకుతుంది. సాదాబైనామాల నుంచి అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. ప్రభుత్వం రెవెన్యూ, రైతు సంఘాల నిపుణులతో చర్చించి ఈ చట్టాన్ని తెస్తున్నాం. అమల్లోకి వచ్చిన తర్వాత జిల్లాలోని అన్ని భూ సమస్యలకు పరిష్కారం దొరుకుతుంది.

ధరణి వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారు

● అన్వేష్‌రెడ్డి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్

ధరణితో రైతులు ఇబ్బందులు పడ్డారు. లొసుగులు ఉండటం మార్పులకు అవకాశం లేక వల్ల సమస్యలు ఎదుర్కొన్నారు. ఆర్‌వోఆర్ చట్టం ప్రకారం రైతులకు మేలు జరుగుతుంది. జిల్లాస్థాయిలోనే నాల్గంచెలవ్యవస్థ ఏర్పాటుకావడంతో అన్ని సమస్యలు ఇక్కడే పరిష్కారం అయ్యే అవకాశం ఉంది.

పేరుకే పెద్దాసుపత్రి.. నిండా సమస్యలే..!

పోస్టులు మొత్తం 38 ఉండగా రెగ్యూలర్ 21 మంది, ఒకరు కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తుండగా 16 ఖాళీలున్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్లు 63మందికి 13మంది రెగ్యూలర్ ప్రొఫెసర్లు ఉండగా, ఆరుగురు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. 44అసోసియేట్ ప్రొఫెసర్ ఖాళీలున్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 147 ఉండగా రెగ్యూలర్ 61 మందే ఉన్నారు. కాంట్రాక్టు పద్ధతిలో 48 మంది ఉండగా, 38 ఖాళీలున్నాయి. టూటర్లు 23మంది ఉండాల్సి ఉండగా 9 మంది రెగ్యూలర్, 11మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. 3 ఖాళీలు ఉన్నాయి. సీఏఎస్‌లు మొత్తం 10మంది ఉండగా రెగ్యూలర్ సిబ్బంది ఎవరూ లేరు. ముగ్గురు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. 7ఖాళీలున్నాయి. ఇటీవల ప్రభుత్వం 18 మంది ప్రొఫెసర్లను బదిలీ చేయడంతో వైద్యుల కొరత తీవ్రంగా వేధిస్తుంది. ప్రస్తుతం పీజీ డాక్టర్లతోనే జిజిహెచ్‌లో వైద్యం అందిస్తున్నారు. సరైన సదుపాయాలు లేకపోవడంతో ఆశించిన మేర రోగులకు వైద్య సేవలు అందడం లేదు. టీహబ్ ద్వారా అత్యాధునిక పరికరాలతో రక్త పరీక్షలు గతంలో నిర్వహించారు. కానీ ప్రస్తుతం కొన్ని పరీక్షలకు మాత్రమే రక్తనమూనా సేకరిస్తున్నారు. క్యాట్‌లాగ్, సిటీస్కాన్, టిఫాస్కానింగ్, తదితర పరికరాలు ఉన్నప్పటికీ వైద్యుల కొరతతో ఆ సేవలు పేదలకు అందడం లేదు. సిటీస్కాన్, ఎంఆర్‌ఐ స్కానింగ్ తదితర సేవలను పేదలు పొందాలంటే ప్రైవేటు ఆసుపత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. మంత్రి పర్యటన నేపథ్యంలో ఆగమేఘాలపై జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో మరమ్మతులు చేస్తున్నారు. కొద్దికాలంగా పనిచేయని లిఫ్ట్, తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. లీకేజీలకు హడావుడిగా మరమ్మతులు చేయడంపై విమర్శలు వస్తున్నాయి.

నాలుగేళ్లకు పైగా ఇన్‌చార్జి పాలన

జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రతిమరాజ్ గత నాలుగున్నర ఏళ్లుగా ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. 700 పడకల ఆసుపత్రికి రెగ్యూలర్ సూపరింటెండెంట్‌గా ఎవరూ వచ్చేందుకు ముందుకు రావడం లేదనే ఆరోపణలున్నాయి. కొద్దికాలంగా ప్రభుత్వ ఆసుపత్రిలో దొంగతనాలు జరగడంతో పాటు ఆసుపత్రిపై నుంచి పడి అనేక మంది మృత్యువాత పడుతున్నారు. సరైనరక్షణ చర్యలు, సరైనపర్యవేక్షణ లేకపోవడంతో ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. రెగ్యూలర్ సూపరింటెండెంట్‌ను నియమిస్తే తప్ప జీజీహెచ్ గాడిలో పడే అవకాశాలు కనిపించడం లేదు.

వంద పడకల ఆసుపత్రుల్లోనూ సిబ్బంది కొరత

బోధన్, ఆర్మూర్, భీంగల్‌లలో వంద పడకల ఆసుపత్రులు ఉన్నప్పటికీ వాటిలోనూ సిబ్బంది కొరత వేధిస్తోంది. బోధన్‌లో ఉన్న వంద పడకల ఆసుపత్రి భవనం పురాతనమైనది కాగా ఇటీవల బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి కొన్ని మరమ్మతులు చేయించారు. పూర్తిస్థాయి సిబ్బందిలేక అక్కడ రోగులు ఇబ్బంది పడుతున్నారు. ఆర్మూర్‌లో వంద పడకల ఆసుపత్రి గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసినా పూర్తిస్థాయిలో క్యాడర్‌స్ట్రెంత్‌ను కేటాయించలేదు. ఇప్పటికీ డాక్టర్లు డిప్యూటేషన్లపై పనిచేస్తున్నారు. ఇద్దరు డాక్టర్లతోపాటు 25మంది స్టాఫ్‌నర్సులు మాత్రమే డైరెక్ట్ నియామకాలు చేయగా మిగతా వైద్యులు భీంగల్, బోధన్ నుంచి డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్నారు. భీంగల్‌లో వంద పడకల ఆసుపత్రి మంజూరైనప్పటికీ సొంత భవనం లేదు. అక్కడ కేటాయించిన డాక్టర్లు ఆర్మూర్‌లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. భీంగల్‌లో సైతం వైద్య సేవలు సక్రమంగా అందడం లేదు. ఫార్మసిస్టు, ఫిజియోథెరపి, స్టాఫ్‌నర్సులు ప్రస్తుతం పనిచేస్తుండగా 10మంది సివిల్ సర్జన్‌లు, 8మంది డిప్యూటీ సివిల్ సర్జన్ పోస్టులు మాత్రం ఖాళీగా ఉన్నాయి. డిప్యూటీ డెంటల్ సర్జన్ పోస్టులు ఖాళీగా ఉండటంతో ఇతర చోట్ల నుంచి డిప్యూటేషన్‌పై కేటాయించారు.

● ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అన్నీ సమస్యలే..

మండలకేంద్రాల్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు సమస్యలకు నిలయాలుగా ఉన్నాయి. సరైన వసతులు లేక గ్రామీణ ప్రాంత రోగులు ఇబ్బందులు పడుతున్నారు. పూర్తిస్థాయి సిబ్బంది లేక ఆపరేషన్లు సైతం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కావడం లేదు. వైద్యుల కొరత, మందుల కొరతతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు పూర్వవైభవాన్ని కోల్పోతున్నాయి. నిజామాబాద్ జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలపై మంత్రి దృష్టిపెట్టి పూర్తిస్థాయి వైద్య సిబ్బందిని కేటాయించాలని కోరుతున్నారు.

● నేడు జిల్లాకు రానున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి

రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆదివారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10 గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్ట్ నుంచి హెలిక్యాప్టర్‌లో బయలుదేరి 11 గంటలకు నిజామాబాద్ నూతన కలెక్టరేట్ హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడినుంచి రేంజల్‌లో పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.30లకు నిజామాబాద్‌లోని ఎంసీహెచ్ బిల్డింగ్ ప్రారంభిస్తారు. 2 గంటలకు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శిస్తారు. 3 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. 4.30లకు హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు.

టీయూలో కొనసాగుతున్న పునఃశ్చరణ తరగతులు



తరగతుల్లో ప్రసంగిస్తున్న వక్త

డిచ్‌పల్లి, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో మరియు భారతీయ భాషల విభాగాల సంస్థ మైసూరు వారు సంయుక్తంగా నిర్వహిస్తున్న అధ్యాపకుల పునఃశిక్షణ తరగతుల కార్యక్రమం నాల్గవ రోజూ సాగింది. శనివారం మొదటి ప్రసంగంలో ప్రముఖ అవధాని విమర్శకుడు ఔచిత్యం యుజిసి కేర్ లిస్ట్ పత్రికా సంపాదకుడు రాంభట్ల పార్వతీశం శర్మ చందస్సు వినూత్న బోధనా పద్ధతులు అనే అంశంపైన అనర్గళంగా ప్రసంగించారు. విద్యార్థులలో చందస్సు పట్ల భయాన్ని తొలగించి సులభతరంగా చందస్సును బోధించడం ద్వారా వాళ్లు కూడా మంచి పద్యాలను రాయగలుగుతారని అన్నారు. రెండో ప్రసంగంలో ప్రముఖ కథారచయిత, విమర్శకుడు కేపీ అశోక్‌కుమార్ నవల రచన పద్ధతులను గురించి ప్రసంగించారు. తొలితరంలో వచ్చిన నవల పరిణామ పద్ధతులను వివరించారు. మూడో ప్రసంగంలో ప్రముఖ భాషా శాస్త్రవేత్త, ఆచార్య బాణాల భుజంగరెడ్డి మాట్లాడుతూ భారతీయ భాషల్లో ద్రావిడ భాషల ప్రత్యేకతను విద్యార్థులకు వివరించాలని చెప్పారు. తెలుగులోని అచ్చులను హల్లులను విద్యార్థులను నోటితో పలికించాలని అప్పుడే స్పష్టత వస్తుందని వారు అధ్యాపకులుగా తయారై నవనిర్మాణ సమాజానికి తోడ్పడుతారని చెప్పారు. నాల్గవ ప్రసంగంలో సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్‌లో పనిచేస్తున్న వెంకటేశ్వర్లు తెలుగు అధ్యాపకులు ఇతర భాషలకు తెలుగు నేర్పే పద్ధతుల మీద ప్రసంగించారు. ఇతర భాషలైన కొరియన్, జపాన్, చైనా, జర్మనీ తదితర ప్రాంతాల నుండి తెలుగు భాషను నేర్చుకొని వచ్చి తెలుగు భాషను నేర్చుకోవడానికి వచ్చిన వారికి తెలుగు భాషను బోధించడం చాలా కష్టమన్నారు. తెలుగు భాషా నేర్చుకోవడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని బాధపడటం కాకుండా భాషా ద్వారా జీవనోపాధిని పొందేలా వాళ్లకు మెలకువలు నేర్పించాలని సూచించారు.

బాలుర హాస్టల్‌లోని సమస్యలను పరిష్కరించాలి

డిచ్‌పల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ విశ్వవిద్యాలయం నూతన బాయ్స్ హాస్టల్ విద్యార్థులు నిరసనకు దిగారు. మెస్‌ను బంద్ చేసి సమస్యలు పరిష్కరించాలని హాస్టల్ ఎదుట భీష్మించుకొని కూర్చున్నారు. వీసీ వచ్చి సమస్యల పరిష్కారానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వీసీ స్పందించి సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

దిగివచ్చిన వర్సిటీ అధికారులు

హాస్టల్‌లో నెలకొన్న వివిధ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్‌తో నిరసనకు దిగిన విద్యార్థులు ఎట్టకేలకు హామీలతో వెనక్కితగ్గారు. విద్యార్థులు భోజనం చేయకుండా నిరసన చేపట్టారు. దీంతో వెంటనే స్పందించిన వర్సిటీ ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ ఆచార్య ఆరతి, ఇతర అధికారులు విద్యార్థుల వద్దకు చేరుకొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎంతకీ వినకపోగా వీసీ యాదగిరిరావుతో ఫోన్ ద్వారా మాట్లాడించారు. 14రోజుల గడువులోగా సమస్యల పరిష్కరిస్తామని స్పష్టమైన హామీఇవ్వడంతో విద్యార్థులు ఎట్టకేలకు నిరసనను విరమించారు.

డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర దినోత్సవం

ధర్పల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం గణితశాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపల్ జ్యోతి, గణితశాస్త్రం విభాగం హెచ్‌వోడి శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు హాజరై మాట్లాడారు. దీనిలో భాగంగా విద్యార్థిని విద్యార్థులు తమ తమ గణితశాస్త్ర ప్రదర్శనలను ప్రదర్శించారు. ఎంపికైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంధన పొదుపు ముగింపు వారోత్సవాలు

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇంధన పొదుపు వారోత్సవాల సందర్భంగా టీజీరెడ్కో ఆధ్వర్యంలో శనివారం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల గూపన్‌పల్లి విద్యార్థులకు వివిధపోటీలను నిర్వహించారు. చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రెడ్కో జూనియర్ మేనేజర్ అరుణ్, ఫీల్డ్‌ఆఫీసర్ జగదీప్‌రామ్ హాజరై తరగని ఇంధన వనరులను ఉపయోగించుకుంటే భవిష్యత్తు తరాలకు ఉపయోగపడుతాయని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారం కోసం సంఘటిత పోరాటాలకు సిద్ధం కావాలి: సీపీఎం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోసం కష్టజీవులను ఐక్యపోరాటాల ద్వారా సంఘటితం చేయాలని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం సీపీఎం జిల్లా పార్టీ కార్యాలయంలో కార్మికవర్గ ప్రజాసమస్యల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై సమావేశం నిర్వహించారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, కాంట్రాక్టర్లకు లాభాలు చేకూర్చే పద్ధతిలో ఆలోచిస్తున్నాయని అన్నారు. విద్వేశాలను రెచ్చగొట్టడానికి అంబేద్కర్‌ను కించపరిచే పద్ధతుల్లో రాజ్యాంగాన్ని అవమానిస్తూ అమిత్‌షా మాట్లాడారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా గత ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పెద్దివెంకట్రాములు, సిర్పలింగం, అనసూయమ్మ, రాములు, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎస్సైల బదిలీ

ఖిల్లా, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): పోలీసు కమిషనరేట్ పరిధిలో ఎస్సై లుగా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు ఎస్సైలను బదిలీ చేస్తూ శనివారం ఇన్‌చార్జీ పోలీసు కమిషనర్ సింధూశర్మ ఉత్తర్వులు జారీచేశారు. ట్రాఫిక్ పోలీసు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న బి.సంజీవ్‌ను వేల్పూర్ పీఎస్‌కు బదిలీచేశారు. సీసీఎస్ అటాచ్‌గా ఏడో బెటాలియన్ డిచ్‌పల్లిలో విధులు నిర్వహిస్తున్న చంద్రమోహన్‌ను ట్రాఫిక్ ఎస్సైగా బదిలీచేశారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి: చైర్మన్ రాజారెడ్డి

మోపాల్, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): బోర్గాం(పి) గ్రామంలో ఉన్న గ్రంథాలయ అభివృద్ధికి తాను సాయశక్తులా కృషిచేస్తానని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతరెడ్డి రాజరెడ్డి అన్నారు. శనివారం బోర్గాం(పి) గ్రామంలో ఉన్న గ్రంథాలయాన్ని సందర్శించి పరిశీలించారు. గ్రంథాయానికి వస్తున్న పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాలయానికి కావాల్సిన పుస్తకాలను సర్దుబాటు చేస్తామని భరోసాఇచ్చారు. గ్రంథాలయానికి వచ్చిన అంతరెడ్డి రాజరెడ్డిని గ్రామ వీడీసీ పెద్దలు నర్సారెడ్డి, మహేందర్‌రెడ్డి, గంగారెడ్డి, మోహన్, భూమయ్య, చిన్నయ్య, గంగాధర్‌తో పాటు గ్రామస్తులు ఆయనను ఘనంగా సన్మానించారు.

సారంగపూర్‌లో అయ్యప్ప పడిపూజ

మోపాల్, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలంలోని సారంగపూర్ గ్రామంలో గురుస్వామి నగేష్‌గౌడ్ నివాసంలో శనివారం అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. పడిపూజ కార్యక్రమానికి అయ్యప్ప స్వాములు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుదర్శన్, శ్రీనివాస్‌గౌడ్, హరిచంద్, అశోక్, నగేష్, అంజి, నర్సయ్య, గులాబ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లిలో..

డిచ్‌పల్లి, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఘన్‌పూర్‌లో అయ్యప్ప స్వాముల మహాపడిపూజ వైభవంగా సాగింది. ఈ మహాపడి పూజ రాజు పంతులు ఆధ్వర్యంలో నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అయ్యప్పస్వాములు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అయ్యప్పస్వాములకు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

సుభాష్‌నగర్, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): జిల్లా జనరల్ ఆసుపత్రిలో జరుగుతున్న తప్పిదాలపై విచారణ చేపట్టి బడుగు బలహీనవర్గాలకు, మెరుగైన వైద్యం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని భీంఆర్మీ జిల్లా కార్యదర్శి బత్తుల కిష్టయ్య అన్నారు. శనివారం ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌజ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్సీ బుక్కులను రెండుప్రింట్ చేయడంపై అనుమానాలకు తావిస్తుందన్నారు. జీజీహెచ్ ఆరోగ్యశ్రీలో నష్టం వాటిల్లిందని దీనిపై విచారణ చేయాలన్నారు. డైట్ టెండర్ల కోసం టెండర్లు వేసినా ఇప్పటివరకు టెండరు దారులను పైనల్ చేయకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారని అన్నారు. వీటిపై రాష్ట్రవైద్య ఆరోగ్యశాఖ మంత్రులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఘనంగా ప్రపంచ ధ్యాన దినోత్సవం

నిజామాబాద్‌కల్చరల్,డిసెంబరు21(ఆంధ్రజ్యోతి):ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని శనివారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నారు. యోగాకేంద్రాలు, స్వచ్ఛంద సంస్థలు, పాఠశాలల్లో ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శిక్షకులచేత ధ్యానం చేయించారు. పలుప్రాంతాల్లో ధ్యానం ప్రాముఖ్యతను తెలియజేస్తూ అవగాహన తరగతులను నిర్వహించారు.

'అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి'



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సుభాష్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సీఐటీయూ, ఎస్ఎఫ్ఐ నాయకులు నాయకులు డిమాండ్ చేశారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద శనివారం అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విఘ్నేష్ మాట్లాడారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలను బేషరత్తుగా వెనక్కి తీసుకోవాలన్నారు. అనుచిత వ్యాఖ్యలు దేశప్రజల మనోభావాలను తీవ్రంగా కలచివేశాయని అన్నారు. అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్‌చేశారు. అమిత్‌షా అంబేద్కర్‌పై చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతం కాదని, బీజేపీ ఆర్ఎస్ఎస్ యొక్క మూలసిద్ధాంతంలో భాగమని అన్నారు. గతంలో అనేకసార్లు కేంద్రమంత్రులు, ఆర్ఎస్ఎస్ చీఫ్ సైతం రిజర్వేషన్లను సమీక్షించాలని భారత రాజ్యాంగాన్ని మార్చడానికి అధికారంలోకి వచ్చామని, అంబేద్కర్ ఒక్కరే రాజ్యాంగాన్ని రాయలేదంటూ అనుచిత వ్యాఖ్యలు చేశారని గుర్తుచేశారు. పదే పదే రాజ్యాంగంపై బీజేపీ, ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ నాయకులు వ్యాఖ్యానిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సావిత్రి, పద్మ, విజయ, కలమ్మ, సరిత, విజయ, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు దినేష్, చక్రి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

స్నేహ సొసైటీలో సపోజ్ క్రిస్మస్ వేడుకలు

నిజామాబాద్‌అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మారుతి నగర్‌లోగల స్నేహ సొసైటీ ఫర్ రూరల్ రీకన్‌స్ట్రక్షన్ దివ్యాంగుల పాఠశాలలో సపోజ్ క్రిస్మస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిని రసూల్‌బీ, సిఎస్ఐ చర్చి పాస్టర్ రెవరెండ్ జార్జ్‌లు హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా దివ్యాంగ విద్యార్థులు యేసుక్రీస్తు జన్మదిన ఇతివృత్తాన్ని కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. కార్యక్రమంలో స్నేహ సొసైటీ కార్యదర్శి సిద్ధయ్య, ప్రిన్సిపాల్ జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పల్లెవేటు ఉత్సవం

నిజామాబాద్ కల్చరల్, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప ఉత్సవంలో భాగంగా శనివారం అయ్యప్ప దేవాలయ ఆధ్వర్యంలో పల్లెవేటు ఉత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయంలో పండితులు వేదమంత్రాలతో అయ్యప్పకు ప్రత్యేక పూజలు నిర్వహించి మేళతాళాలతో పల్లెవేటకు అయ్యప్ప స్వామిని ఊరేగింపు నిర్వహించారు. ఆలయం నుంచి బయల్దేరిన అయ్యప్ప శోభాయాత్ర సుభాష్‌నగర్ మీదుగా జెడ్పీవరకు సాగింది.

సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్షా ఉద్యోగుల యజ్ఞం

నిజామాబాద్ అర్బన్, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించేలా సీఎం సంకల్పబలం ఇవ్వాలని కోరుకుంటూ సమగ్ర శిక్షా ఉద్యోగులు శనివారం యజ్ఞం నిర్వహించారు. గత 15రోజులుగా సమ్మె చేస్తున్న ఉద్యోగులు వినూత్న నిరసనలో భాగంగా యజ్ఞం నిర్వహించారు. ప్రభుత్వ మొండి వైఖరిని వీడాలని గత 15 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాజు అన్నారు. ఆ భగవంతుడు సీఎంకు తమ సమస్యల పరిష్కారం కోసం సంకల్పబలం ఇవ్వాలని కోరుతూ యజ్ఞం నిర్వహించామన్నారు. శనివారం సమ్మెకు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, స్వామియాదవ్, ప్రసాద్, కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు రఘురాం, తదితరులు సంఘీభావం తెలిపారు.

గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

సిరికొండ, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి) సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుకబడి తరగతుల గురుకుల విద్యాలయాల్లో 2025-26 విద్యాసంవత్సరానికి ఐదవ తరగతిలో చేరడానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని, ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని తల్లిదండ్రుల సంఘం జిల్లా అధ్యక్షుడు నక్క రాజేందర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో నాలుగో తరగతి చదువుచున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం లక్షా యాభై వేలు, పట్టణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల ఆదాయం 2లక్షలు ఉండాలన ఆయన తెలిపారు. విద్యార్థుల వయస్సు 9 ఏళ్ల నుంచి 11 ఏళ్ల వయస్సు ఉండాలని, ప్రవేశ పరీక్ష ఎంపిక చేసినకేంద్రాల్లో ఫిబ్రవరి 23న ఉంటుందని తెలిపారు.

'నకిలీ బంగారం ఇచ్చి మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి'

సిరికొండ, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి): నకిలీ బంగారం ఇచ్చి మోసగించిన వ్యక్తిని అరెస్టు చేసి డబ్బులు ఇప్పించాలని పోత్నూర్ గ్రామానికి చెందిన బొందల మహేష్ సిరికొండ ఎస్సై ఎల్.రామ్‌కు ఫిర్యాదు చేశారు. రమేష్ అనే వ్యక్తి కేరళలో తాను జేసీబీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాని, జేసీబీతో మైసూర్ అనే ప్రాంతంలో తవ్వకాల్లో సుమారుగా 3కిలోల బంగారం ఉందని, తక్కువ ధరకే విక్రయిస్తానని చెప్పగా మహేష్ చెప్పాడు. చిత్తూర్‌లోని మదనపల్లికి వచ్చి రావాలని రమేష్ చెప్పడంతో మహేష్ అక్కడికి వెళ్లాడు. అక్కడ గ్రాము బంగారం ఇచ్చి టెస్టు చేసుకోవాలని చెప్పగా టెస్టులో బంగారం ఒరిజినల్ అని తేలింది. దీంతో మహేష్‌తో మిగిలిన 3కిలోల బంగారాన్ని రూ.9లక్షలకు బేరం కుదుర్చుకున్నాడు. రమేష్, తన మేనల్లుడు రంజిత్ కలిసి 7లక్షలు తీసుకుని బెంగళూరు వెళ్లారు. అతను చెప్పిన అడ్రస్‌కు మ హేష్, రంజిత్ వెళ్లి రమేష్‌తోపాటు మరో ఇద్దరు వ్యక్తులకు ఏడు లక్షలు ఇచ్చి బంగారాన్ని తీసుకున్నారు. తీర అట్టి బంగారాన్ని టెస్టు చేయగా అది నకిలీ అని తేలడంతో మహేష్ మోసపోయినట్లు తెలుసుకుని మోసగాళ్లను పట్టుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భార్యను హత్య చేయడానికి యత్నించిన వ్యక్తి అరెస్ట్ రిమాండ్

ఖిల్లా, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పుట్టింటికి వెళ్లిపోయిన భార్యను హత్య చేయడానికి వారి ఇంటి కిటికిలో నుంచి పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేయడానికి యత్నించిన శ్రీరాంరమేష్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మూడవ టౌన్ ఎస్ఐ హరిబాబు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని మూడవ టౌన్ పోలీసు స్టేషన్ పరిధికి చెందిన శ్రీరాంరమేష్‌కు 2017లో సుభాష్‌నగర్‌కు చెందిన యువతితో వివాహం జరిగింది. వీరిద్దరి మధ్య తరుచూ గొడవలు జరిగేవి. దీంతో మనస్థాపానికి గురయి శ్రీరాంరమేష్ భార్య సుభాష్‌నగర్‌లోని తన పుట్టింటికి వెళ్లిపోయింది. భార్య వెళ్లిపోవడంతో ఆమెఇంటికివెళ్లి కిటికి ద్వారా పెట్రోల్‌పోసి నిప్పంటించాడు. శ్రీరాంరమేష్ భార్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

'రాత పరీక్షలు లేకుండా కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యూలరైజ్ చేయాలి'

సుభాష్‌నగర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాత పరీక్షలు లేకుండా కాంట్రాక్టు ఏఎన్ఎంలను రెగ్యూలరైజ్ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద శనివారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ ఆరోగ్యశాఖలో 2000 సంవత్సరం నుంచి నేటి వరకు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్ఎంలు రెగ్యూలరైజేషన్, కనీస వేతనాలు, ఇతర చట్టబద్ధత సౌకర్యాలు అమలు చేయాలని దశాబ్దాల తరబడి ఆందోళన పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. సమ్మెల సందర్భంగా ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలుపర్చడం లేదన్నారు. గతంలో సమ్మె సందర్భంగా ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. సమస్యల పరిష్కారం కోసం సమగ్ర నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాలని పేర్కొన్నారని అన్నారు. కానీ ఇప్పటి వరకు కమిటీ సమావేశం కాలేదన్నారు. త్రిసభ్య కమిటీని సమావేశపర్చి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలన్నారు. వ్రాత పరీక్ష లేకుండా రెగ్యూలర్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం జిల్లా నాయకురాలు ప్రమీల, గంగాజమున, సావిత్రి, విజయలక్ష్మి, సరోజ, సుమలత పాల్గొన్నారు.